సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కాన్వొకేషన్ సంబురం

నల్లగొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థుల కాన్వొకేషన్ సెర్మనీ సంబురంగా జరిగింది. - 8లో



భార్య హత్య కేసులో..

మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో భార్యను హత్యచేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఎన్‌కౌంటర్‌కు పదేళ్లు

మోత్కూరు మండలం జానకిపురం గ్రామ శివారులో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నేటితో పదేళ్లు పూర్తయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగింపు

భానుపురి: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పొడిగించిన తేదీలోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోర్టల్/ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ 08684 231023, 9492611057 నంబర్లను కార్యాలయ వేళల్లో సంప్రదించాలని కోరారు.

గోదావరి జలాలు పెంపు



71డీబీఎం కాలువకు పెరిగిన నీళ్లు

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు అదనంగా మరో విడత గోదావరి జలాలను బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే తొలి రోజు 1000 క్యూసెక్కుల నీటిని వదలగా గురువారం 1,325 క్యూసెక్కులకు పెంచారు. ఇందులో 69 డీబీఎంకు 500 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 25 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 800 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నట్లు బయ్యన్నవాగు డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు. రైతులు కాలువలకు గండ్లు పెట్టి నష్టం కలిగించకుండా గోదావరి జలాలను వాడుకోవాలని సూచించారు.

వైభవంగా నారసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణం జరిపి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో నేరేడుచర్లకు ప్రథమ స్థానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)కు సంబంధించి మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లాలోనే నేరేడుచర్లకు ప్రథమ స్థానాన్ని దక్కింది. మొత్తం 80.45 శాతం పన్ను వసూలు చేసి మిగతా మున్సిపాలిటీల కంటే ముందంజలో నిలిచింది. ఇందుకు కృషిచేసిన నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డిని అభినందిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆస్తి పన్ను వసూలు చేసిన అధికారుల, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

దిగుబడి దిగులు!

ఆలస్యంగా పూత పూసిన మామిడి తోటలు

- జనవరిలో మంచు, వాతావరణ మార్పులతో రాలిన పిందె
- ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడమే కారణం
- జిల్లావ్యాప్తంగా 11,250 ఎకరాల్లో తోటలు సాగు
- ఆందోళనలో తోటల యజమానులు, కౌలురైతులు



మఠంపల్లి : బక్కమంతులగూడెం వద్ద తోటలో పూత పిందె కనిపించని మామిడి చెట్లు

మఠంపల్లి: సకాలంలో వర్షాలు కురవని కారణంగా ఈ సారి మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ ఏడాది ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పులు మూలంగా ఉదయం మంచు కురవడం, మధ్యాహ్నం తీవ్రమైన ఎండలు మండడంతో మామిడి తోటలు పూత, పిందె మాములుగానే వేశాయి. అయితే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మామిడి చెట్ల ఎండు కొమ్మల్లో బొంత పురుగులు ఏర్పడి కాసిన కొద్దిపాటి కాయలను కూడా తొలిచి వేస్తున్నాయి. దీంతో మామిడి దిగుబడి తగ్గనుందని, తమకు నష్టాలు తప్పేలా లేవని మామిడి తోటల యజమానులు, కౌలురైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది పూత ఆలస్యంగా..

జిల్లాలో ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో మామిడి తోటలు కాస్త ఆలస్యంగా పూత పూశాయి. దీంతో పిందెలు సరిగా లేక కాయలు కాయలేదు. కాసిన కొన్ని కాయలు కూడా గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో కురిసిన మంచుకు పూర్తిగా రాలిపోయాయి. వాస్తవంగా ఎకరా మామిడి తోట గతంలో వాతావరణం అనుకూలించి 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది కనీసం 1 నుంచి 2 టన్నుల వరకు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని మామిడి తోటల రైతులు, ముఖ్యంగా కౌలురైతులు మదనపడుతున్నారు. దీనికితోడు చెట్లకు పురుగు మందుల పిచికారీ, తోటలలో విద్యుత్ మోటార్ల ఏర్పాటు, పైపులైన్ల నిర్మాణం తదితర ఖర్చులు అదనపు భారంగా మారాయని వాపోతున్నారు.

వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా..

జిల్లాలోని మఠంపల్లి, హుజూర్‌నగర్ నడిగూడెం, మునగాల, పెన్‌పహాడ్, సూర్యాపేట, మోతె, నూతనకల్ తదితర మండలాల పరిధిలో సుమారు 11,250 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అయితే తోటల యజమానులు, కౌలురైతులు వేలాది రూపాయిలు పెట్టుబడులు పెట్టినా ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. సరిగా కాయని తోటలను సంబంధిత అధికారులు పరిశీలించి నష్టాల బాటలో ఉన్న తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

మామిడి దిగుబడి తగ్గింది



రెండేళ్లుగా మామిడి దిగుబడి తగ్గిపోతోంది. వాతావరణంలో మార్పులకుతోడు చీడపీడలు ఆశించడంతో పూత, పిందె దశలోనే రాలిపోయి నష్టాల పాలయ్యాం. ఈ ఏడాది ఎకరాకు 2 టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే మామిడి రైతులను నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– శాగంరెడ్డి గోపాల్‌రెడ్డి, రైతు, చౌటపల్లి, మఠంపల్లి మండలం

తోటల సాగుపై అవగాహన కల్పించాలి



మామిడితోటల సాగుపై రైతులకు ఉద్యానవన అధికారులు సదస్సులు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. మామిడిలో యాజమాన్య పద్ధతులపై అనుసరించాల్సిన చర్యల గురించి తెలపాలి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– ముదెం ప్రతాపరెడ్డి, ఎర్రగట్టు బక్కమంతుల గూడెం, మఠంపల్లి మండలం

ఆశించినంతగా కాతలేదు

జిల్లా వ్యాప్తంగా సుమారు 11వేల ఎకరాల పైచిలుకు మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈఏడాది ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పులు మూలంగా మామిడి తోటలు ఆశించినంతగా కాయలేదు. అయితే రైతులు ఉద్యానవన అధికారులను సంప్రదించి సరైన మోతాదులో పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకోవాలి.

– టి.నాగయ్య, జిల్లా ఉద్యానవన అధికారి, సూర్యాపేట

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పక్కన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి తదితరులు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్, రోడ్లు, కాలువ లైనింగ్ పనులను మూడె నెలల్లో పూర్తిచేయాలన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనుల డిజైన్లను అధికారులు తమ ఇష్టానుసారం మార్చవద్దన్నారు. కొత్త మండలాలకు మంజూరైన ప్రభుత్వ భవనాలను వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. ఎవరైనా చెరువులు, ఎస్ఎస్‌పీ కాలువల స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. మేళ్లచెరువులో ఎస్సెస్పీ కాలవపై మూడు చోట్ల ఉన్న బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలన్నారు. హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అగ్రికల్చర్ కళాశాలకు 100 ఎకరాలు, కోదాడలో జవహర్ నవోదయ విద్యాలయానికి 25 ఎకరాల స్థలం అవసరం ఉందని అధికారులు దానిని సేకరించాలని సూచించారు. ఆయా పనులను వారం రోజుల్లో పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రూ.1,15,701.94 కోట్లు, కోదాడ నియోజకవర్గానికి రూ.51,999.81 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటిని వివిధ శాఖలకు సంబంధించిన పనులకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఈఎన్‌సీ అనిల్, సీఈ రమేష్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

దొడ్డి కొమురయ్య జీవితం.. స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ రాంబాబు



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

భానుపురి: నిజాం ప్రభువుల అరాచక పాలన, భూస్వాములు, పెత్తందారులను ఎదురించి తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ నాయక్, డీడబ్ల్యూఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు లత, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు వజ్జే వీరయ్య, డాక్టర్ రామ్మూర్తి, పోలెబోయిన నర్సయ్య, పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి: ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో యాసంగి (2024-25) ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్లకు మద్దతు ధర రూ.2,320తోపాటు క్వింటాపై రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 127, ఐకేపీ ఆధ్వర్యంలో 137, మెప్మా ఆధ్వర్యంలో 12, ఎఫ్‌పీఓ 10, మొత్తం 286 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, జిల్లా సహకార అధికారి పద్మ, మెప్మా పీడీ రేణుక, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీ ఎం.బెనర్జీ, పీఏసీఎస్ అధికారులు, ఐకేపీ నిర్వాహకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యువ న్యాయవాదులు వృత్తినైపుణ్యం సాధించాలి

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ


చివ్వెంల: యువ న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యం సాధించాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ అన్నారు. యువ న్యాయవాదులకు చేయూత నందించాలనే ఉద్దేశంతో గురువారం సూర్యాపేట జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదులు పొదిల ప్రదీప్‌కుమార్, గోండ్రాల అశోక్ బహూకరించిన మూడు కంప్యూటర్లు, మూడు ప్రింటర్లను జిల్లా ఇన్‌చార్జి ప్రధాన జడ్జి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూనియర్లకు సహకారం అందిస్తున్న సీనియర్ న్యాయవాదులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యువ న్యాయవాదులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్లు అందబాటులో ఉండటం వల్ల తమ పిటిషన్లను త్వరగా తయారు చేసుకుని కోర్టులో వేసుకోవచ్చని సూచించారు. దీంతో సమయం వృథాకాకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాతలను యువ న్యాయవాదుల సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములు స్వాధీనం చేసుకోవద్దు

సూర్యాపేట టౌన్: అనేక రకాల వన్య ప్రాణులకు నిలయమైన హెచ్‌సీయూ ఆధీనంలోని 400 ఎకరాల భూములను పరిశ్రమల స్థాపన పేరుతో స్వాధీనం చేసుకొనే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బతి వెంకటేశ్వర్లు, కొచ్చెర్ల వేణు డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విశ్వవిద్యాలయాల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూడడం తగదన్నారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులను నిర్బంధాలకు గురిచేసేలా ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, రమణ ఆనంద్ భాస్కర్, సింహాద్రి, క్రాంతి కుమార్, వెంకటయ్య, యాదగిరి, లింగయ్య, కవిత, యోగానంద చారి ప్రభాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

పారితోషికం ఏదీ..?

- సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లు
- నాలుగు నెలలైనా అందని పైకం
- జిల్లాలో 1,293 మంది ఆపరేటర్ల ఎదురుచూపులు



హుజూర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నేటికీ పారితోషికం అందలేదు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 141 వార్డులతో పాటు 23 మండలాల్లో 486 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఎన్యుమరేటర్లను నియమించి సమగ్ర సర్వే చేయించింది. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,293 మంది డాటాఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. వారికి పారితోషికం కింద ఒక్కో ఫామ్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు రూ.25 చొప్పున ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రకారంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు మొత్తంగా రూ 1.07 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే తమ బ్యాంకు ఖాతా వివరాలు సేకరించినప్పటికీ నేటికీ పారితోషికం అందించలేదని డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పారితోషికం అందించాలని కోరుతున్నారు.

నిధులు విడుదల కాగానే ఖాతాల్లో జమచేస్తాం

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల పారితోషికం బిల్లులన్నింటినీ ప్రభుత్వానికి పంపించాం. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిధులు విడుదలయ్యాయి. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ 1.07 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– కిషన్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, సూర్యాపేట

ప్రశాంతంగా టెన్త్ ఒకేషనల్ పరీక్ష

సూర్యాపేట టౌన్: జిల్లాలో గురువారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ ఒకేషనల్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ అశోక్ తెలిపారు. 1,155 మంది విద్యార్థులకు 1,140 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

5న ఉచిత శిక్షణ తరగతులు

భానుపురి: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఈనెల 5న వివిధ విభాగాల్లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ తెలిపారు. గురువారం 45వ వార్డులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వామిరామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ నెల 5న ఉదయం 9గంటల నుంచి సూర్యాపేటలోని శ్రీభగవాన్ ఆయుర్వేదిక్ బిల్డింగ్‌లో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసి, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9618062848, 9032341944 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేసి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

గుట్ట ఆలయంలో సౌకర్యాలపై ఈఓ సమీక్ష

యాదగిరిగుట్ట: ప్రస్తుత వేసవి కాలం దృష్ట్యా యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్పించాల్సిన సౌకర్యాలపై ఆలయ ఈఓ భాస్కర్‌రావు గురువారం దేవస్థానం అధికారులతో సమీక్షించారు. వేసవి సెలవుల్లో భక్తులు సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రాకుండా ఆలయ పరిసరాల్లో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్వామి వారికి దర్శనానికి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లలో ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్షలో డీఈఓ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రి జిల్లాలో భారీ వర్షం



యాదాద్రి భువనగిరి జిల్లాలో గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి తుర్కపల్లిలో నేలరాలిన మామిడికాయలు



భూదాన్‌పోచంపల్లిలో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

ఓటరు నమోదు షురూ..

- ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారుల ఏర్పాట్లు
- ఏప్రిల్ 1 నుంచి 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కుకు అర్హులు
- జిల్లాలో ప్రస్తుతం 10,08,511 మంది ఓటర్లు



భానుపురి: కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఏటా నాలుగు సార్లు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నిత్యం దరఖాస్తులు స్వీకరించి.. మండల, గ్రామస్థాయిలో విచారణ చేపడుతున్నారు. కాగా ఏప్రిల్‌లో కొత్త ఓటరు నమోదుకు కావాల్సిన ఏర్పాట్లను యంత్రాంగం పూర్తిచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల రానున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గ్రామస్థాయి లీడర్లు కొత్తవారికి ఓటు హక్కు కల్పించి తమకు అనుకూలంగా మలుచుకునేందుకు యత్నిస్తున్నారు.

ఏటా నాలుగు సార్లు..

గతంలో ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి జనవరిలో కొత్తగా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించేవారు. అయితే ఫిబ్రవరిలో 18 ఏళ్లు నిండిన వారు తమకు ఓటు హక్కు కావాలంటే మరో 11 నెలల పాటు ఆగాల్సి పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి ఏటా నాలుగు సార్లు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ మాసాల్లో ఓటు హక్కు పొందేందుకు అవకాశం కల్పించింది.

మహిళా ఓటర్లే అధికం

ఈ ఏడాది జనవరి మాసంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 10,08,511 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. 4,90,826 మంది పురుషులు ఉండగా 5,13,402 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. అంటే పురుషుల కంటే మహిళలు 23,162 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నాటినుంచి కూడా మహిళా ఓటర్లదే పైచేయిగా ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికల సంఘం కల్పించిన అవకాశంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగానే పెరగనుందని అధికారులు భావిస్తున్నారు.

నమోదు ఇలా..

18 ఏళ్లు నిండిన వారు బూత్‌స్థాయి అధికారి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే సవరణలు, చిరునామా మార్పులు, తొలగింపునకు అవకాశం ఉంటుంది. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాలు, తొలగింపునకు ఫారం-7, దిద్దుబాట్లు, సవరణలు, చిరునామా మార్పునకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రానున్న ఒకట్రెండు నెలల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పట్టణాల్లో ఉన్న వారు అక్కడి నుంచి గ్రామాలకు తమ ఓటు హక్కును బదిలీ చేసుకునే అవకాశముంది.

క్లుప్తంగా

వలస కూలీ ఆత్మహత్య

భువనగిరిటౌన్: ఉపాధి నిమిత్తం భువనగిరి పట్టణానికి వచ్చిన వలస కూలీ బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన షాహబొద్దీన్ మూడు నెలల క్రితం ఉపాధి కోసం భువనగిరికి వచ్చాడు. తాతానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు జగదేవ్‌పూర్ అడ్డా వద్ద కూలీ పనికి వెళ్తుంటాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం కూలీ పనికి వెళ్లిన అతను మధ్యాహ్నం కడుపునొప్పి రావడంతో తాతానగర్‌లోని రూంకి వచ్చాడు. మిగతా కూలీలు సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి షాహబోద్దీన్ ఉరేసుకుని కనిపించాడు. ఈమేరకు వారు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో జాతీయ రహదారిపై గురువారం నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి టాటాఏస్ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం, మండేలగూడెం గ్రామానికి చెందిన లింగరబోయిన భాస్కర్ వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూరగాయలను హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు తరలించేందుకు టాటాఏస్ డ్రైవర్ కిరణ్‌కుమార్‌తో కలిసి బుధవారం రాత్రి తన స్వగ్రామం నుంచి కూరగాయల లోడ్‌తో వెళ్తున్నాడు. కందిగడ్డ తండా సమీపంలో జాతీయ రహదారిపై ఇసుక లోడ్‌తో నిలిచి ఉన్న లారీని టాటాఏస్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో టాటాఏసీ డ్రైవర్ పక్కన కూర్చున్న భాస్కర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకర్ తెలిపారు.

గంజాయి పట్టివేత

చౌటుప్పల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో స్థానిక పోలీసులు గురువారం రెండు కిలోల గంజాయిని పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన ఉత్పల్‌మండల్(34) ఒరిస్సా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలలో విక్రయించాలనే ఆలోచనతో బస్సులు మారుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుడు చౌటుప్పల్‌లో బస్సు దిగాడు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసులు బస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడు. అతడి నుంచి తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ నిర్వహించి కోర్టులో రిమాండ్ చేశారు. అనంతరం నల్లగొండ జైలుకు తరలించారు.


గ్రాడ్యుయేషన్ డేలో వైద్య విద్యార్థుల ఆనందోత్సాహం

కాన్వొకేషన్ సంబురం


గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా స్నేహితురాలికి క్యాప్ పెడుతున్న విద్యార్థి

- నల్లగొండ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్
- గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న 142మంది విద్యార్థులు



నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే (కాన్వొకేషన్)ను గురువారం ఎస్‌ఎల్‌బీసీలోని కళాశాల ఆవరణలో నిర్వహించారు. కళాశాలలో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 142మంది మొట్టమొదటి (2019–25) బ్యాచ్ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. కార్యక్రమానికి వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు తరలిరావడంతో మెడికల్ కళాశాల ప్రాంతం సందడిగా మారింది. అంతకు ముందు విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేయగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

నల్లగొండను గుర్తుంచుకుంటా



నేను కేరళ నుంచి వచ్చి నల్లగొండలోని ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోవడం నా జీవితాంతం గుర్తుంచుకుంటాను. భాషతో సంబంధం లేకుండా విద్యార్థులంతా కలిసిపోయి ఒకరికొకరం వైద్య విద్యకు సంబంధించిన సలహాలు, సూచనలు చేసుకుంటూ ఎంబీబీఎస్ పూర్తి చేశాను.

– అన్నా, కేరళ

ఢిల్లీ కంటే నల్లగొండ నచ్చింది



నేను పుట్టి పెరిగింది ఢిల్లీలో అయినా నల్లగొండలో వైద్య విద్యను చదువుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఢిల్లీ కంటే నల్లగొండ జిల్లా కేంద్రం నాకు నచ్చింది. పీజీ పూర్తి చేసి జనరల్ ఫిజీషియన్‌గా స్థిరపడతాను. నల్లగొండ మెడికల్ కళాశాలలో మొట్టమొదటి బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పట్టా అందుకోవడం నాకు జీవితాంతం గుర్తుండిపోనుంది.

– హిమాన్షి, ఢిల్లీ

గుండె వైద్యసేవలు అందిస్తా



నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొట్టమొదటి బ్యాచ్‌లో ఎంబీబీఎస్, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి గ్రాడ్యుయేషన్ పట్టా అందుకోవడం గొప్ప అనుభూతి నిచ్చింది. కళాశాల వాతావరణం, ప్రొఫెసర్ల పర్యవేక్షణ సహకారం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. పీజీ చేసిన తర్వాత గుండె వైద్యుడిగా ప్రజలకు సేవలందిస్తా.

– అగ్నితేజ్, వరంగల్

ఆర్థోపెడిక్ డాక్టర్ కావడమే నా లక్ష్యం



కష్టపడి చదివి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచితంగా సీటు సాధించి ఎంబీబీఎస్ పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి కళాశాలలోని ప్యాకల్టీతో పాటు మంచి వాతావరణం ఉండడంతో విద్యార్థులమంతా ఎలాంటి ఒత్తిడి లేకుండా వైద్యవిద్యను పూర్తి చేయగలిగాం. పీజీ పూర్తి చేసి ఆర్థోపెడిక్ డాక్టర్ కావడమే నా లక్ష్యం.

– శ్రీనిధి, హైదరాబాద్

ప్రభుత్వ వైద్యుడిగా పేదలకు సేవ చేస్తా



ఎంబీబీఎస్‌తో పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి గ్రాడ్యుయేట్ పట్టా అందుకోవడం జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం. మధ్య తరగతిలో జన్మించిన నేను ఎంబీబీఎస్ పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉంది. మొట్టమొదటి బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేయడం నమ్మలేకపోతున్నాను.

– మనుగొండ రాకేష్, హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా

సొంత ప్రాంతంలో ఎంబీబీఎస్ చేయడం గర్వంగా ఉంది



నిరుపేద కుటుంబంలో పుట్టిన నేను సొంత జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో మొట్టమొదటి బ్యాచ్‌లోనే ఎంబీబీఎస్ చదువు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వంగా ఉంది. నా తండ్రి ఆటో నడుపుతూ వ్యవసాయం చేస్తుండగా తల్లి రోజు వారీ కూలి పని చేసి నన్ను చదివించారు. న్యూరోఫిజిషియన్‌గా పేద ప్రజలకు వైద్యం అందించాలనేది నా ధ్యేయం.

– కొండాపురం నరేష్, నెమ్మాని, నార్కట్‌పల్లి మండలం


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


సెల్ఫీ దిగుతున్న వైద్య విద్యార్థులు


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

కిడ్నాప్ కేసు నమోదు

నాగార్జునసాగర్: విజయపురి నార్త్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కిడ్నాప్ కేసు నమోదైంది. ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల మండల పరిధిలోని పశువేముల గ్రామానికి చెందిన పండ్ల హరిశ్చంద్రకు అదే గ్రామానికి చెందిన సమీప బంధువులకు గతంలో ఘర్షణ జరిగింది. గొడవల కారణంగా ప్రస్తుతం హరిశ్చంద్ర నల్లగొండ జిల్లా కనగల్లులో ఉంటున్నాడు. పింఛన్ కోసం నాగార్జునసాగర్‌కు రావడంతో సమాచారం తెలుసుకున్న సమీప బంధువులు తన భర్తను కిడ్నాప్ చేశారని ఆయన భార్య నిర్మల విజయపురి నార్త్(సాగర్) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో ఆటో పల్టీ కొట్టిన సంఘటనలో బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని మహాదేవ్ గంజ్ ప్రాంతానికి చెందిన ఆరుగురు కార్మికులు సూర్యాపేట పట్టణంలోని కార్తికేయ ఫ్యాబ్రికేషన్ సంస్థ తరుపున రేకుల షెడ్లు నిర్మించే పనుల్లో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో షెడ్లు నిర్మించేందుకు ఆరుగురు కార్మికులు ఇక్కడకు వచ్చారు. పనులు ముగిసిన అనంతరం సాయంత్రం ఆటోలో సూర్యాపేటకు బయలు దేరుతుండగా చెర్కుపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కార్మికులు సుధీర్, ఆదిత్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కేతేపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సంజయ్‌రెడ్డి, నాగాచారి సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నకిలీ మద్యం, స్పిరిట్ తరలింపు

నాంపల్లి: మండలంలోని గానుగుపల్లి గ్రామంలో చండూరుకు చెందిన ఎర్రజెల్ల రమేష్ వ్యవసాయ క్షేత్రంలో నకిలీ మద్యం దందాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టురట్టు చేసిన విషయం తెలిసిందే. గురువారం స్థానిక ఎస్‌ఐ మొగుళ్ల శోభన్‌బాబు 180లీటర్ల నకిలీ మద్యం , 600 లీటర్ల స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు బాటలో రేవంత్‌రెడ్డి పాలన

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా పనిచేసిన చంద్రబాబు పాలన బాటలోనే ప్రస్తుతం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగుస్తున్నారని, ఇది ప్రజాపాలన కాదు.. రాక్షస పాలనఃఅని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. నకిరేకల్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు విద్యుత్ చార్జీలు తగ్గించాలని న్యాయపోరాటానికి దిగిన విద్యార్థులు, రైతులపై బషీర్‌బాగ్‌లో అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గంగా జరిపించిన కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించింది చంద్రబాబు సర్కారేనని అన్నారు. అదే ధోరణిలో నేడు రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీలు ఝుళిపిస్తున్నారని ధ్వజమెత్తారు. యావత్ తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ధమనకాండను గుర్తుపెట్టుకుని తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వానికి వడ్డీతో సహా చెల్లించే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఆదాయం పెంచుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం పర్యావరణానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకొని జీఓ జారీచేసిందన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ప్రతిపక్ష నేతలు, సినీ ప్రముఖులు సంఘటితమై ప్రభుత్వంపై పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గుర్రం గణేష్, సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేషం, పల్లే విజయ్, యానాల లింగారెడ్డి, రాచకొండ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మఠంపల్లి : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హనుమంతులగూడెం సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ పి.బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన యాతం సైదులు (45) తన ద్విచక్రవాహనంపై మండలంలోని యాతవాకిల్ల నుంచి స్వగ్రామం కల్మలచెరువుకు వెళ్తుండగా మార్గమధ్యలో హనుమంతులగూడెం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను హత్య చేసిన కేసులో రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

గుర్రంపోడు: మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో భార్యను హత్యచేసిన భర్తను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు సీఐ రాజు గురువారం గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గుర్రంపోడు మండలంలోని తేరాటిగూడెం గ్రామానికి చెందిన దెప్పేలి అరుణ (45)ను భర్త దుప్పెల్లి కిరణ్ కత్తితో మెడ కోసి పరారయ్యాడు. కిరణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతోనే తన భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి కత్తి, సెల్‌ఫోన్, దుస్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక చొరవ చూపిన ఎస్‌ఐ పసుపులేటి మధు, కానిస్టేబళ్లు కావలి నర్సింహ, వెల్లి నాగరాజు, నాగార్జున రెడ్డి, సత్యనారాయణ, కిరణ్, సైదులును దేవరకొండ ఏఎస్పీ మౌనిక అభినందించారు.

జానకిపురం ఎన్‌కౌంటర్‌కు నేటితో పదేళ్లు

- అమరులైన ఎస్‌ఐ సిద్ధయ్య, కానిస్టేబుల్ నాగరాజు
- పోలీసు కాల్పుల్లో ఇద్దరు సెమి ఉగ్రవాదులు హతం


ఎస్‌ఐ సిద్ధయ్య (ఫైల్)


కానిస్టేబుల్ నాగరాజు (ఫైల్)

మోత్కూరు: మోత్కూరు మండలం జానకిపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి పదేళ్లు పూర్తయ్యాయి. 2015 ఏప్రిల్ 4న జరిగిన ఎన్‌కౌంటర్ అప్పట్లో సంచలనం సృష్టించింది. పోలీసులపై సెమి ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు అప్పటి ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ సిద్ధయ్యతో పాటు అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ చొగోని నాగరాజు అమరులయ్యారు. అదే సమయంలో సంఘటనా స్థలానికి చేరుకున్న అప్పటి రామన్నపేట సీఐ ఎ.బాలగంగాధర్‌రెడ్డి పోలీస్ సిబ్బందికి మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీఐ బాల గంగాధర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీస్ సిబ్బంది కాల్పుల్లో ఇద్దరు సెమి ఉగ్రవాదులు అస్లాం ఆయుబ్, జాకిర్‌బాదల్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ప్రాణాలను లెక్క చేయకుండా ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులు

ఎన్‌కౌంటర్ ముందు రోజు సూర్యాపేట బస్టాండ్‌లో ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యారు. వారి కోసం పోలీస్ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. అర్వపల్లి దర్గా ప్రాంతంలో తలదాచుకొని తిరుమలగిరి మీదుగా అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు నుంచి వెళ్తూ దారి తప్పి జానకిపురం గ్రామ శివారుకు చేరుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బైక్‌పై వెళ్లగా బైక్ వాగులోని ఇసుకలో కూరుకుపోయింది. దీంతో మరో బైక్ తీసుకొని గ్రామ శివారులోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వచ్చిన ఆత్మకూరు(ఎం) పోలీస్ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ సీటులో ఉన్న కానిస్టేబుల్ నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా ఎస్‌ఐ సిద్ధయ్య శరీరంలోకి తూటాలు దిగడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వారిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం ఎస్‌ఐ సిద్ధయ్య మృతి చెందారు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులను యావత్ దేశ ప్రజలు అభినందించారు.

గల్లంతైన మరో ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యం




జతిన్, శ్యామ్‌చరణ్ మృతదేహాలు

భూదాన్‌పోచంపల్లి: ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెందిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. బుధవారం రాత్రి బొడ్డు శ్యామ్‌చరణ్ మృతదేహం దొరకగా, గురువారం ఉదయం జి.జతిన్ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌కు చెందిన బీటెక్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు బుధవారం పరీక్షలు రాసిన అనంతరం బైక్‌పై ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో సరదాగా ఈతకొట్టడానికి దేశ్‌ముఖి శివారులో గల క్వారీగుంత వద్దకు వెళ్లారు. ఈత రాకపోవడంతో వారు అందులో పడి గల్లంతయ్యారు. ఫైర్ సిబ్బందితో రాత్రంతా గాలింపు చర్యలు చేపట్టగా శ్యామ్‌చరణ్ మృతదేహం లభించింది. జతిన్ మృతదేహం ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు గురువారం తెల్లవారుజామున మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. వీరిద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య


భారతి (ఫైల్)

చౌటుప్పల్: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో మనస్థాపానికి గురైన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్ప డింది. ఈ ఘటన గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్‌కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకులం జిల్లాకు చెందిన కర్ర వాసుదేవరావు, ఆమె భార్య కర్ర భారతి స్థానిక గణేష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. ఉదయం ఉద్యోగానికి వెళ్లిన భారతి మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. అప్పటికే ఇంట్లో ఉన్న భర్త వాసుదేవరావుతో ఆమెకు గొడవ జరిగింది. ఆ క్రమంలో మనస్థాపానికి గురైన భారతి ఇంట్లో రూమ్‌లోకి వెళ్లి సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్ప డింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అప్పుల బాధతో..

నార్కట్‌పల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఆకవరపు ఉపేంద్రచారి (45) గ్రామంలో మోటార్ మెకానిక్ షాపు కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. షాపు సరిగా నడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. అప్పులు కావడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఆకవరపు ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం

మునగాల: మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన కౌలురైతు కొండమీది శివకృష్ణ గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన ఎరువుల డీలరుకు కౌలురైతు శివకృష్ణకు మధ్య రుణానికి సంబంధించి వివాదం నెలకొనడంతో మనస్థాపానికి గురైన శివకృష్ణ ఎరువుల దుకాణం ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అతడికి ప్రాథమిక చికిత్స అందించి, కోదాడకు తరలించారు. ప్రస్తుతం శివకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

ఎఫ్‌ఎస్‌టీపీ పరిశీలించిన కేంద్ర బృందం


ఎఫ్‌ఎస్‌టీపీ తయారీ పరిసరాలను పరిశీలిస్తున్న బృందం

భువనగిరిటౌన్ : స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) ద్వారా అమలు జరుగుతున్న పనులను పరిశీలించేందుకు గురువారం కేంద్ర బృందం జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌ఎస్‌టీపీ (మలపదార్థాన్ని శుద్ధి చేసి, భద్రంగా నిర్వహించడానికి రూపొందించిన) ప్లాంట్‌ను సందర్శించారు. సెప్టిక్ ట్యాంకులు, గుంట లాట్రిన్ల నుంచి సేకరించిన మలాన్ని శుభ్రపరిచి, పునర్వినియోగానికి అనుకూలంగా మారుస్తుందని డీఆర్‌డీఓ నాగిరెడ్డి కేంద్ర బృందానికి తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భూగర్భజలాలను కాలుష్యం నుంచి రక్షించడం, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడానికి మురుగునీరు శుద్ధి చేసి వ్యవసాయానికి లేదా పారిశ్రామిక వినియోగానికి ఉపయోగించేందుకు ఉపయోగపడుతుందని కేంద్రా బృందానికి వివరించారు. సందర్శనలో కేంద్ర బృందం ప్రతినిధులు డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ నితిన్‌వర్మ, కన్సల్టెంట్ జైపాల్‌దక్ష, ఎస్‌బీఎం డైరెక్టర్ సురేశ్‌బాబు, స్వచ్ఛభారత్ మిషన్ సిబ్బంది, ప్లాంట్ సిబ్బంది తదితరులున్నారు.

కుటుంబసభ్యులకు వృద్ధురాలు అప్పగింత

నల్లగొండ : మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలిని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. నల్లగొండ టూ టౌన్ పరిధిలో గురువారం మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలు తిరుగుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఆమెను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. టూ టౌన్ ఎస్‌ఐ సైదులు విచారించగా.. ఫలితం లేకపోవడంతో సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబ సభ్యులను గుర్తించారు. వారిని స్టేషన్‌కు పిలిపించి వృద్ధురాలిని అప్పగించారు. ఏఎస్‌ఐ ఉమ, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.